నేడు కార్తీక వన భోజన మహోత్సవం

అల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యుల వన భోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మియాపూర్‌లోని ధర్మపురి క్షేత్రంలో జరిగే కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శెట్టి బలిజ అసోసియేషన్ ఆధ్వర్యంలో....

కేపీహెచ్‌బీ కాలనీ, 3వ ఫేజ్ బస్టాండ్ వద్ద, కేపీహెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శెట్టి బలిజ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు.

గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో..

వివేకానందనగర్ కాలనీలోని చిత్తారమ్మ దేవాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడ సంఘీయుల వన భోజన మహోత్సవం ఉంటుందని కూకట్‌పల్లి కొండిన్య (గౌడ) సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నివాళులర్పించిన కార్పొరేటర్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్యనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భాను కుమారుడు రోహిత్‌చంద్ర(9) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏఎల్ ఫౌండర్ హీరాచంద్‌కు ఘన నివాళి



పూలమాలేసి నివాళి అర్పిస్తున్న వర్కర్స్

బాలానగర్: హెచ్‌ఏఎల్ ఫౌండర్ సేట్ వాల్ చంద్ హీరాచంద్ జన్మదినం సందర్భంగా బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్ పరిశ్రమ సౌత్ గేట్ వద్ద ఆయన విగ్రహానికి శనివారం హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హీరాచంద్ సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు విజయ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్వర్, కర్క నాగరాజు, చంద్రరావు నాయక్, తుల్లాహ్, బాబీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



మురుగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి తదితరులు

అల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు పనులు, సీవరేజ్ పైపులైన్ పనుల్లో నాణ్యత పాటించాలని, పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. శనివారం వివేకానందనగర్ డివిజన్‌లోని వేంకటేశ్వర నగర్, మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ వద్ద, వేంకటేశ్వర నగర్ రోడ్డు నెంబర్ 14లో, రిక్షాపుల్లర్స్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు, మురుగునీటి పైపులైన్ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శ్రావణి, వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రియాంక, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింహులు, రమేష్‌రావు, సోమేష్, వెంకటేశ్వరరావు, శ్యామ్, రామచందర్, నరేష్, మహేష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన



మోతీనగర్: బాలబాలికల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందని జెనెక్స్ పాఠశాల సీఈవో బి. శ్రీలత అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని పాఠశాల ఆవరణలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున్, జితేంద్ర, భారతి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

మోతీనగర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. డయాబెటిక్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎర్రగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి సేవకులకు డయాబెటిక్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు క్రమం తప్పకుండా వయస్సుతో నిమిత్తం లేకుండా వాకింగ్‌ను అలవర్చుకోవాలన్నారు. ఆహారం తీసుకున్న తరువాత కనీసం పావుగంటైనా వాకింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సుజాత తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న కోటిరెడ్డి, సుజాత తదితరులు

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఈఓ విజయకుమారి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లోని ఎస్ఎస్‌కేకే స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక, మేడ్చల్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. సుమారు 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 24 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. ముగింపు సమావేశంలో డీఈఓ విజయ కుమారి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అదే విధంగా 8 మందిని సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్, 17 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎంఈఓ కృష్ణ, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఓ రమేష్, ఎస్ఎస్‌కేకే స్కూల్ సెక్రటరీ బాబు, ప్రిన్సిపాల్ సుమాదేవి, అన్ని మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

సమాచారం లేదని..బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గాగిల్లాపూర్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి అనేక ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం అన్ని జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా జిల్లాలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు సమన్వయంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తుంటారు. కానీ మేడ్చల్ జిల్లాలో మాత్రం ఉపాధ్యాయుల తరఫున ఎన్నికైన ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని జిల్లా అధికార యంత్రాంగం ఆహ్వానించకపోవటంతో పాటు ఉపాధ్యాయ సంఘాలకు కనీస సమాచారం అందించకపోవటాన్ని ఆ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాలు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బహిష్కరించినట్లు పేర్కొన్నాయి. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులు శ్రీధర్, నవీన్, వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, మదన్‌రెడ్డి, రాఘవేందర్ కోరారు.

బచ్‌పన్ అండ్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో స్పోర్ట్స్ డే



స్పోర్ట్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: బచ్‌పన్ అండ్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఫేజ్ 1, 2 బ్రాంచీల ఆధ్వర్యంలో శనివారం కేపీహెచ్‌బీ కాలనీలోని టైటాన్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆపరేషనల్ డైరెక్టర్ కోయిలకొండ శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ శ్రీవిద్య, సెంటర్ హెడ్ సోహని మార్గదర్శకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహిస్తూ మంచి ప్రేరణ అందించారు.

భగవద్గీతపై శిక్షణ తరగతులు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠంలో బ్రహ్మశ్రీ వడ్లమాని సూర్యనారాయణ శర్మచే భగవద్గీతపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం, స్కూల్ సెలవు రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారులు, 6 నుంచి 20 సంవత్సరాల వారితో పాటు పెద్దలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ 5, రోడ్డు నెంబర్ 2, హనుమాన్ ఆలయం వెనుక నూతన డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణ పనులను శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పాతూరి గోపి, నాగేశ్వరరావు, జాన్ మోసెస్, కృష్ణ, స్వప్న, మమత, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

35 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌పై ఆకస్మిక దాడి చేసి 35 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ మార్కెట్ రోడ్డులోని సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌లో గడువు ముగిసిన నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌పై దాడి చేశారు. షాపు యజమాని ఓం ప్రకాష్‌ను పోలీసులు ప్రశ్నించగా.. గడిచిన ఆరు సంవత్సరాల కిందట దీపక్ అనే వ్యక్తి పరిచయమై..తక్కువ ధరకు అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి సప్లై చేస్తున్నాడని, వాటిని కొని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి వివిధ పేర్లతో ఉన్న ఐదు కేజీల డబ్బాల నుంచి 200 గ్రాముల డబ్బాల వరకు ఉన్న 35 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మూసాపేట సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

అనారోగ్య సమస్యలతో గృహిణి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి చెందిన లక్ష్మయ్య, పార్వతి(39) భార్యాభర్తలు. వీరికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు కాకపోవడంతో పార్వతి మెడిసిన్ వాడటంతో సైడ్ ఎఫెక్ట్‌తో వెన్నోకోస్, బోన్ వీక్‌నెస్‌తో బాధపడుతూ వస్తోంది. 3 సంవత్సరాల క్రితం బట్టలు ఉతుకుతుండగా జారీ పడటంతో కాలు విరిగింది. దీనికి తోడు భర్తకు గుండె సమస్య తలెత్తడంతో మానసికంగా కృంగిపోయింది. ఈ నెల 22న భర్త పని నిమిత్తం, కుమార్తె వాత్సల్య స్కూల్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కుమార్తె తలుపు తట్టినా తీయలేదు. దీంతో సమీపంలో ఉన్న ఆమె బంధువు చంద్రశేఖర్, చుట్టు పక్కల వాళ్ల సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా.. పార్వతి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు పక్కన భిక్షాటన చేసే గుర్తు తెలియని వ్యక్తి(34) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్ 3లో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా.. వారు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎవరైనా గుర్తు పట్టిన వారు ఇతర వివరాల కోసం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

లక్ష తులసీదళ అర్చన

జగద్గిరిగుట్ట: కార్తీకమాసం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చింతల్ పద్మానగర్ ఫేజ్ 1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్ష తులసీదళ అర్చన నిర్వహించారు. పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న కార్యకర్తలు

కూకట్‌పల్లి: మహారాష్ట్ర ఎన్నికల్లో మరోసారి మహాయుతి కూటమి ఘన విజయం సాధించడంతో శనివారం కూకట్‌పల్లి బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో బీజేపీ కూటమిని ప్రజలు గెలిపించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, అనంత నాగరాజు, దుర్గా ప్రసాద్‌రావు, దినేష్, శంకర్‌రెడ్డి, విశాల్, సంతోష్, రాఘవేందర్, సాయి స్వామి, యోగి స్వామి, శేఖర్‌రావు, భరత్, నరేష్, రాజు, రవి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సత్యసాయి జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి: శ్రీ సత్య సాయి బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మియాపూర్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లోని సత్యసాయిబాబా మందిరంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసిల్లి చంద్రశేఖర్, శ్రీనివాస్ గౌడ్, రోజా, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై.. ఆకట్టుకున్న మెరిడియన్ విద్యార్థుల వీధినాటకం



కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో కూకట్‌పల్లి మెరిడియన్ పాఠశాలకు చెందిన 6, 7 తరగతుల విద్యార్థులు శనివారం జేఎన్టీయూ జంక్షన్‌లో ప్రదర్శించిన వీటి నాటకం ఆకట్టుకుంది. 'సడక్ పే సురక్షా–హమారి సురక్షా' పేరిట రోడ్డు భద్రతా ప్రాముఖ్యతను తెలియజేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, సీటు బెల్టు, హెల్మెట్‌లు ధరించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడకాన్ని నివారించడం, వేగ పరిమితులను పాటించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత అనేది ట్రాఫిక్ పోలీసులు, ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు.

వినూత్న ఆలోచనలతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెక్టార్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, పార్వతి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: వినూత్న ఆలోచనలతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్వవిద్యాలయ రెక్టార్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో శనివారం నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉజ్వల భవిష్యత్ కోసం సరైన మార్గంలో నడవాలని సూచించారు. స్వాగత కార్యక్రమంలో వినూత్నమైన టీజర్ల ప్రదర్శన ద్వారా అనేక ఆవిష్కరణలను పరిచయం చేయటం చూసి గర్వపడుతున్నామన్నారు. విద్యార్థుల విజయాలు విశ్వ విద్యాలయం, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. సమాజంలో పాతుకుపోయిన సమస్యలకు పరిష్కార మార్గాలను చూపేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, స్నేహభావంతో ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఆర్‌సీ చైర్మన్ పార్వతి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించరా?



హైటెక్ సిటీకి వెళ్లే మార్గమధ్యలో రోడ్డుపై వేసిన చెత్త

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ఫేజ్ టు నుంచి హైటెక్ సిటీకి వెళ్లే మార్గమధ్యలో రోడ్డులో చెత్తా చెదారం దర్శనమిస్తోంది. దుర్వాసనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త వేయవద్దని క్లాత్ అడ్డుగా ఏర్పాటు చేసినా చెత్తను వేస్తూనే ఉన్నారు. చెత్తా చెదారంపై ఈగలు, దోమలు వాలి సమీపంలోని ఇళ్లల్లో ప్రవేశించి తినుబండారాలపై వాలటంతో అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తా చెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

స్వీట్లు పంచిన కాంగ్రెస్ నేతలు

బాలానగర్: జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం స్వీట్లు పంచారు. అదేవిధంగా పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ కేరళలోని వయనాడ్‌లో అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు లక్ష్మయ్య, సంజీవ, తూము మనోజ్, రాజేందర్, శివ చౌదరి, అరుణ్, నరేందర్, రమణ తదితరులు పాల్గొన్నారు.